ప్రజాశక్తి
సోమవారం 17 నవంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

చెకుముకి సంబరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

23న జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు

· దర్శిలో నిర్వహణ · జయప్రదం చేయాలని జెవివి పిలుపు

8లో



దంపతులను ఆశీర్వదిస్తున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

వధూవరులకు గవర్నర్ ఆశీర్వాదం

5లో

నమ్మకం లేకనే..!

- మళ్లీ తెరపైకి మార్కాపురం జిల్లా ఉద్యమం
- ఎన్నికల్లో హామీ ఇచ్చిన పాలకపక్ష నేతల తీరుపైనా విమర్శలు
- ఉద్యమించాలని నిర్ణయించిన అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు
- నెలాఖరు లోపు ఉపసంఘానికి నివేదికివ్వాలని సిఎం ఆదేశించారన్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, మార్కాపురం

మొన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో మార్కాపురం జిల్లా అంశం ఎజెండాలో రాకపోవడంతో పాటు మరుసటి రోజునే జిల్లాకు వచ్చిన సిఎం చంద్రబాబు కనీసం దీనిపై మాట్లాడకపోవడంతో పశ్చిమప్రాంతంలో కొత్త చర్చ మొదలైంది. అంతకుముందు వారం రోజులు మంత్రివర్గ సమావేశంలో తీర్మానం అవుతుందనే ప్రచారం జోరుగా సాగింది. అందరూ మార్కాపురం జిల్లా వస్తుందనే ఆశతో ఉన్నారు. 63 అంశాలపై చర్చ సాగితే మార్కాపురం జిల్లా లేకపోవడంతో ఒక్కసారిగా అందరి ఆశలూ ఆవిరయ్యాయి. దీంతో మార్కాపురం జిల్లాపై పశ్చిమప్రాంతంలో ప్రభుత్వంపైనే నమ్మకం తగ్గింది.

సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు చేస్తారా? లేదా? అనే చర్చల్లో ఎక్కువ మంది పెదవి విరుస్తున్నారు. వెలిగొండ విషయంలో జరిగిందే మార్కాపురం జిల్లా విషయంలోనూ జరుగుతోందన్న చర్చ పశ్చిమాన మొదలైంది. రాజకీయపార్టీలపైనా ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ఇదే ఇప్పుడు పార్టీలను కలవరపెడుతోంది. 2లో



నెలాఖరులోపు పూర్తి స్థాయి స్పష్టత

మార్కాపురం జిల్లాపై మంత్రి డోలావీరాంజనేయస్వామిని అడగ్గా నెలాఖరులోపు మంత్రివర్గ ఉపసంఘాన్ని నివేదిక ఇవ్వాలని సిఎంచంద్రబాబు మొన్న జరిగిన సమావేశంలోనే ఆదేశించారని ప్రజాశక్తికి చెప్పారు. నెలాఖరులోపు జిల్లా ఏర్పాటుపై పూర్తి స్థాయి స్పష్టత వస్తుందని మంత్రి వెల్లడించారు. డిసెంబరులోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు కావడం ఖాయమన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆ ప్రాంతంలోని ఐదు నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లా, అద్దంకి, కందుకూరు నియోజకవర్గాల విలీనంతో ఐదు నియోజకవర్గాలతో ప్రకాశం జిల్లా ఉంటుందని చెప్పారు.

మున్సిపల్ వర్కర్ల ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

హక్కుల సాధన కోసం ఉద్యమం తప్పదు..

- ముగిసిన మున్సిపల్ వర్కర్ల రాష్ట్ర మహాసభలు
- ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కనీస వేతనం - కనీస పని గంటలు - కనీస సౌకర్యాలు వంటి కార్మికుల సాధన కోసం ఐక్య ఉద్యమం చేపట్టక తప్పదని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్-ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) 15వ రాష్ట్ర మహాసభలు శనివారం, ఆదివారం ఒంగోలు కొత్త మార్కెట్ వద్ద షాదీ ఖానా (సుబ్బారావు నగర్)లో ఘనంగా జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మున్సిపల్ కార్మికుల ఆశలు-ఆకాంక్షలకు అద్దం పట్టిన ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ మహాసభ రెండో రోజు చురుకైన చర్చలతో, పోరాట సంకల్పాలతో దిగ్విజయంగా ముగిసింది. కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే అమానుష లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఔట్‌సోర్సింగ్-కాంట్రాక్ట్ వంటి దోపిడీ విధానాలకు తక్షణమే బ్రేకులు వేయాలని మహాసభ గట్టిగా తీర్మానించింది. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు మాట్లాడుతూ దోపిడీ పాలకులను గద్దె దించడానికి కార్మికుల ఐక్య ఉద్యమాల ద్వారానే సాధ్యం అవుతాయని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్.నరసింగరావు

పలు తీర్మానాలకు ఆమోదం..

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రవేశపెట్టిన ఔట్సోర్సింగ్ వ్యతిరేక తీర్మానం సభను ప్రభావితం చేసింది. ఔట్సోర్సింగ్ పేరుతో మున్సిపల్ పనిని పూర్తిగా ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే కుట్రను అరికట్టాలని, ఇది కార్మికుల గౌరవం, జీవన భద్రత, హక్కులకు పెద్ద ముప్పని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కే.నాగభూషణం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ రద్దు తీర్మానం ఆమోదం పొందింది. కార్మిక వర్గాన్ని బానిసల మాదిరి కట్టడి చేసే ఈ కోడ్స్‌కు వ్యతిరేకంగా సామూహిక పోరాటం చేయాలని కోరారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. వెంకటరెడ్డి ప్రవేశపెట్టిన సమాన పనికి సమాన వేతనం - 12వ పిఆర్సీ అమలు' తీర్మానానికి మహాసభ ఆమోదం తెలిపింది. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పర్మినెంట్ కాని ఉద్యోగులందరినీ ఒకే విధంగా గౌరవించి, పర్మినెంటు చేయాలని తీర్మానం చేసింది.

నమ్మకం లేకనే..

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో ఉన్న వారంతా ఏకమయ్యారు. పార్టీలు, ప్రజాసంఘాల నేతలు మళ్లీ ఉద్యమానికి ఆజ్యం పోశారు. లేకుంటే జనం తరుముతారనే భయం కూడా వెంటాడుతోంది. అందుకే మళ్లీ మార్కాపురం జిల్లా ఉద్యమాన్ని సాధన సమితి చేపట్టింది. ఆనాడు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయి. దీక్షలు చేపట్టారు. ప్రస్తుత ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూడా దీక్షల్లో ఉన్నారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, జనసేన తదితర పార్టీలన్నీ మార్కాపురం జిల్లా కోసం ఉద్యమించాయి. ఇప్పుడు వామపక్షాలే బలంగా మార్కాపురం జిల్లాకు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే ఎన్నికలకు ముందు జరిగిన పోరాటంలో తెలుగుదేశం పార్టీ నేతలు కూడా కీలకంగా ఉన్నారు. ఎన్నికల్లో ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు పశ్చిమప్రాంతంలో అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రచారసభల్లో మార్కాపురం జిల్లాను చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చింది. జిల్లాల పునర్విభజనపై చర్చ సాగుతున్నప్పుడల్లా చేస్తారనే భావనలోనే ఉన్నారు. ఏడాది తర్వాత ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘం జిల్లాల్లో పర్యటిస్తుందని భావించినా జరగలేదు. అందరి అభిప్రాయాలు తీసుకుంటామని కొంతకాలం చెప్పారు. అదీ లేదు. ఇక జిల్లాల్లో ఉండే మంత్రులు పశ్చిమ ప్రాంతానికి వెళ్లిన ప్రతి సారీ త్వరలోనే మార్కాపురం జిల్లా ఏర్పాటవుతుందని హామీలు ఇస్తూ వచ్చారు. ఇటీవల కందుకూరు విషయంపై చర్చ సాగినప్పుడు గానీ, మంత్రివర్గ ఉపసంఘం భేటీలతో గానీ జిల్లాలపై వేడి పెరిగింది. ఇక ప్రకటనే తరువాయి అనే చర్చ సాగింది. మొన్న జరిగిన మంత్రివర్గ సమావేశంపై గంపెడాశలతో ఉన్నారు. అక్కడ ఏమీ లేకపోవడంతో ఆశలు నీరుగారాయి. ఇక లేదనే చర్చ కూడా పశ్చిమప్రాంతంలో మొదలైందంటే పరిస్థితి ఎలా ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. ఏదో ఒకటి చెప్పి ఏడాదిన్నర గడిపారు. ఇంకెంతకాలం అనే భావన కూడా వచ్చేసింది. మళ్లీ ఉద్యమించక తప్పదనే పరిస్థితి ముందుకువచ్చింది. ఇదే తరుణంలో పాలకపక్ష ఎమ్మెల్యేలపైనా విమర్శలు వస్తున్నాయి. కొత్త జిల్లాపై శ్రద్ధ లేదనే చర్చ పశ్చిమాన పెరుగుతోంది. ఎవరూ గట్టిగా దీని కోసం పనిచేయడం లేదనే భావన పెరుగుతోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇప్పుడు మౌనంగా ఎందుకు ఉంటున్నారనే ప్రచారం పెరుగుతోంది. మార్కాపురం జిల్లా ఇష్టం లేదా? లేక ఒంగోలులోనే ఉండాలనే భావనలో ఉన్నారా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పుడు తెలుగుదేశం ఆధిక్యతలో ఉన్నా రానున్న కాలంలో వైసిపికి బలంగా మారుతుందనే చర్చ కూడా పాలకపక్ష నేతల్లో ఉంది. అందుకే మార్కాపురం జిల్లాపై శ్రద్ధ తగ్గించారా? అనే చర్చ నడుస్తోంది. ఇప్పుడు ఎవరికి ఇష్టం ఉన్నా, ఎవరికి లేకున్నా ఏదేమైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది.

జాతీయ రహదారి-565

ప్రమాదాల అడ్డా..

విద్యుత్ దీపాలు లేక ఇక్కట్లు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం సమీంపలోని జాతీయ రహదారి -565 ప్రమాదాలకు అడ్డాగా మారుతోంది. జాతీయ రహదారులను పర్యవేక్షించే అధికారుల జాడ మచ్చుకైనా కానరావడం లేదు. జాతీయ రహదారులపై లోపించిన లోపాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించిన దాఖలాలు కనిపించడం లేదు.

మార్కాపురం ప్రాంతంలో జాతీయ రహదారి-565 నిర్మాణం దశాబ్ద కాలం క్రితం జరిగింది. జాతీయ రహదారి ఆనుకుని ఉన్న నివాస ప్రాంతాల్లో జాతీయ రహదారిపై డివైడర్, దాంతో పాటు విద్యుత్ దీపాలు (సెంట్రల్ లైటింగ్) ఏర్పాటు చేయాలి. మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలకల పారిశ్రామికవాడ... దాని సమీపంలోనే రాయవరం రైల్వే స్టేషన్ ప్రాంతం జాతీయ రహదారి పరిధిలో ఉన్నాయి. ఈ రహదారికి ఇరువైపులా నివాసాలు ఉన్నాయి. జన సంచారం కూడా అధికంగా ఉంది. నిబంధనల ప్రకారం విద్యుత్ దీపాలు అమర్చారు. రహదారికి మధ్యలో డివైడర్ కూడా నిర్మించారు. విద్యుత్ దీపాలు సోలార్ సిస్టమ్ ద్వారా వెలుగు అందిస్తున్నాయి. విద్యుత్ దీపాలు కూడా ఆటోమేటిక్‌గా రాత్రి వెలిగేలా ఉంచాల్సిన అధికారులు పగలు వెలిగేలా రూపొందించారు. రాత్రి మాత్రం చీకటి వాతావరణం నెలకొంది. పలకల పారిశ్రామికవాడ, రాయవరం రైల్వే స్టేషన్ ప్రాంతంలోని రహదారిపై రాత్రివేళ అంధకారం అలుముకుంది. వాహనాల రాకపోకల సమయంలో రాత్రివేళ అటుఇటుగా రహదారి దాటాల్సిన చిన్నారులు, వృద్ధులు తరచూ ఇబ్బందులకు గురవుతున్నారు. పశువులు తిరుగుతుంటాయి. వాహనాల

బస్సులు ఢీకొని మృతి చెందిన పాడి గేదెలు

వెలుగులు కళ్లలో పడటంతో వాహనం మీదికి వస్తుందనే భయంతో వణికిపోతున్నారు. రహదారిపై విద్యుత్ వెలుగులు రాత్రివేళ కనిపించినట్లయితే వాహనాల వెలుగులతో ఇబ్బంది పెద్దగా ఉండదు. ఈ విషయాన్ని పదేపదే అధికారులకు విన్నవించుకున్నా స్పందించడం లేదు. ఇటీవల కాలంలో అనేక ప్రమాదాలు జరిగాయి. కొందరు మృత్యువాత పడ్డారు. మరికొందరు క్షతగాత్రులుగా మిగిలారు.

తాజాగా శనివారం రాత్రి రెండు ఆర్టీసి బస్సులు పాడి గేదెలను ఢీకొన్నాయి. మార్కాపురం మండలంలోని రాయవరం వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రహదారిపై విద్యుత్ లైట్లు వెలగకపోవడం కారణంగా ఈ ప్రమాదం జరిగింది. రాత్రి 7:30 గంటల ప్రాంతంలో అంతా చీకటిగా మారింది. అదే రహదారిపై రెండు పాడిగేదెలు రహదారి దాటుతున్నాయి. ఒక ఆర్‌టిసి బస్సు ఒక గేదెను ముందుగా ఢీకొంది. ఆ గేదె మృతి చెందడంతో మరో గేదె చనిపోయిన గేదె వద్ద నుంచి

జాతీయ రహదారిలో వెలగని విద్యుత్ దీపాలు

కదల్లేదు. మరి కొద్ది సమయంలో మరో ఆర్‌టిసి బస్సు వేచివున్న పాడి గేదెను ఢీకొంది. రెండు పాడి గేదెలు మృతి చెందాయి. ఇలాంటి ప్రమాదాలు ఎన్నో జరుగుతున్నాయి. చిన్నపాటి సమస్యను తీర్చకపోవడంతో పెద్ద ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి ఉందనేది అధికారులు గ్రహించకపోవడం దారుణం! ఇప్పటికైనా లైట్లు వెలిగిస్తే కొన్ని ప్రమాదాలైనా నివారించే అవకాశం ఉంది!!

ముసుగులోనే విగ్రహాలు.. పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-త్రిపురాంతకం: స్థానిక ఎంపీడీవో ప్రాంగణంలో గత టిడిపి ప్రభుత్వంలో అప్పటి తెలుగుదేశం పార్టీ ఎస్సీ సామా జిక వర్గానికి చెందిన నాయకులు గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. అయితే ఇంకా పూర్తి కావాల్సి ఉంది. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం రావ డంతో ఎవరూ పట్టించుకోలేదు ఇప్పుడు తిరిగి టిడిపి ప్రభుత్వం రావడంతో ఇక్కడ దళిత నాయకులు ఎవరికీ ప్రాతినిధ్యం, సముచిత స్థానం ఇవ్వకపోవడంతో ఎవరూ ముందుకు రాని పరిస్థితి. స్వయానా ఇది ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ ఇక్కడ ఎవరూ దీని గురించి పట్టించుకోకపోవడం బాధా కరం. అంబేద్కర్ వారసులమని చెప్పుకుంటూ పదవు లు అనుభవిస్తూ రిజర్వేషన్లపై ఉద్యోగాలు సంపాదించినవారు కూడా దీని గురించి పట్టించుకోకపోవడం పట్ల వారు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక దళిత పెద్దలు ఈ విగ్రహాలను పూర్తి చేసి ప్రారంభించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రస్తుత ఎంపీడీవో ఎస్‌టి సామాజిక వర్గానికి చెందినవారు కాబట్టి మండల పరిధిలోని నిధులను కేటాయించి అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు నడుం బిగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు తొలగని ముసుగు

కోటి సంతకాల సేకరణకు ఆదరణ

ప్రజాశక్తి-పెద్దారవీడు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకర ణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణకు ఆదరణ పెరుగుతోంది. మండల కేంద్రమైన పెద్దారవీడు ఎస్సీ కాలనీలో కోటి సంతకాల సేకరణ ఆ గ్రామ సర్పంచి దుగ్గెం చెన్నమ్మ సారథ్యంలో శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా సర్పంచి చెన్నమ్మ మాట్లాడుతూ వైద్య విద్యతో పాటు వైద్యం ప్రభుత్వ ఆధీనంలో కొనసాగాలన్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు ప్రైవేటు వైద్యం, ప్రైవేటు వైద్య విద్య కొనుగోలు చేయడం కష్టమని, కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయంతో జనంలో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని అన్నారు. మాజీ సిఎం వైఎస్ జగన్ చేసిన మంచి పనులను చెరిపేసేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆమె ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ నాయకులు వేశపొగు ప్రసాద్‌రావు, వైసిపి పెద్దారవీడు మండల యూత్ అధ్యక్షులు దుగ్గెం దినేష్, వార్డు మెంబర్ వేశపోగు కమలాస్, మాజీ డీలర్ దుగ్గెం భాస్కర్, వేశపొగు కిరణ్, వేశపోగు రాజేష్, వేశపోగు బెన్నీ, అరవీటి నాగార్జున, ఆరవీటి శ్రీను, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అవసరమని యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఈగా శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలు తుపాను నగర్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి డిబిఆర్‌సి ఏరియా కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ ఈగ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగం, బాలల శ్రమ నిషేధం చట్టం-1986, బాలల ఉచిత, తప్పనిసరి విద్యా హక్కు చట్టం-2019 మేరకు 14 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయించటం నేరమన్నారు.

మహారాజశ్రీ తెనాలి 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఈ.పి 66/2020 ఇన్ ఓ.యస్. 78/2009
బిట్వీన్:
త్రిపురనేని మధురవాణి ...డి.హెచ్.ఆర్
వర్సెస్
రావెళ్ళ నాగేశ్వరరావు(డైడ్) మరియు వగైరాలు ...జె.డి.ఆర్‌లు
టు
6వ జె.డి.ఆర్. రావెళ్ళ కృష్ణారావు, తండ్రి లేటు నాగేశ్వరరావు, కూచిపూడి గ్రామము, అమర్తలూరు మండలం, బాపట్ల జిల్లా
పై నెంబరు ఈ.పి లో మీకు శ్రీకోర్టు ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టు వారు ఆర్డరు వేస్తూ ది.09-12-2025వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల శ్రీకోర్టువారిచే మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడునని యిందు మూలంగా తెలియపరచడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:9-12-2025
ఇట్లు
మాదినేని రామ్‌ప్రసాద్,
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది, తెనాలి.
సెల్:9246469955

మహారాజ శ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు లో
I.A.No. 661/2019
In
O.S.No.31/2014
గుడిపాటి బసవయ్య మరియు వగైరాలు ...వాది
వర్సెస్
గోగుల గురవయ్య (died) మరియు వగైరాలు ... ప్రతివాదులు
To,
D4) గోగుల బాలయ్య,
S/o. గురవయ్య,
R/o. ఓబులక్క పల్లి గ్రామం,
పొదిలి మండలం, ప్రకాశం జిల్లా.
పై నెంబర్ దావా తేది:21-11-2025 దిన మీ నోటీసు కొరకు ఉన్నది. కావున పైనెంబర్ దావా యందు మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది: 21-11-2025న ఉదయం 10:30 గంటలకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరై మీఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిచొ మీ పరోక్షమును తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
// శ్రీ కోర్టు వారి ఉత్తరువుల మేరకు //
తేది :16-11-2025.
వాయిదా తేది:21-11-2025.
ఇట్లు
వరికూటి నాగరాజు, B.Com., B.L.
వాది తరుపున అడ్వకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ :89855 63337, 94401 40498.

మహారాజశ్రీ ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
MVOP No : 208/2023
మధ్యలో :
మాడపర్తి హరిబాబు .....పిటీషనర్
మరియు
నల్లపు డానియల్ డిలోనెక్స్, వగైరా....రెస్పాండెంట్స్
To
R1) నల్లపు డానియల్ డిలోనెక్స్,
తండ్రి లివింగ్టన్,
నివాసం : డోరు నెం.9-5-51/7, చర్చిదగ్గర,
వెంగలరావునగర్, చీరాల, బాపట్ల జిల్లా,
పై నంబరు అప్పీలు దావాలో 1వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా సదరు కేసు తాలూకు నోటీసులు పంపిననూ, వాటిని తీసుకొననందున, కోర్టువారు మీకు నోటీసులు జారీచేయు నిమిత్తముతేది18-11-2025న వాయిదా వేసి సదరు వాయిదాను ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు పై తెలిపిన వాయిదా రోజున ఉదయం గం. 10:30 ని.లకు మీరు స్వయముగా గానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ, పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కొనగలరు. లేని యెడల కోర్టువారు మీకు పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.
// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 18-11-2025.
ఇట్లు
నన్నెబోయిన ఆంజనేయులు, M.A., LL.B.,
అప్పిలెంట్ తరపున న్యాయవాది, ఒంగోలు,
ప్రకాశం జిల్లా.

గంజాయి రవాణాకు అడ్డాగా రైళ్లు

ఒరిస్సా నుంచి చెన్నైకి సరఫరా

ముమ్మరంగా పోలీసుల తనిఖీ

మూడు నెలల్లో 14 మంది పట్టివేత

100 కేజీల గంజాయి స్వాధీనం

రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు (ఫైల్)

ప్రజాశక్తి-శింగరాయకొండ

గంజాయి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంతో గంజాయి రవాణా చేసే ముఠా రూటు మార్చారు. గతంలో బస్సుల్లో ఆటోల్లో లారీల్లో కారులో ట్రావెల్స్ బస్సుల్లో చేపల వాహనాల్లో గంజాయి రవాణా చేసే ముఠా ఇప్పుడు రూటు మార్చి జాతీయ రహదారులు అయితే ఇబ్బందని రైలు మార్గాన్ని నమ్ముకున్నారు. ఆ రైలు మార్గం ద్వారా వచ్చే గంజాయి ముఠాని పట్టుకునేందుకు పోలీసు యంత్రాంగం కూడా రూటు మార్చింది. ఒక జాగిలాన్ని ప్రత్యేకంగా గంజాయి పట్టుకునేందుకు శిక్షణ ఇచ్చి ఆ జాగిలం ద్వారా రైల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. గత మూడు నెలలుగా ప్రకాశం జిల్లా పోలీసులు రైలు మార్గం ద్వారా వెళుతున్న గంజాయి ముఠాపై ప్రత్యేకమైన నిఘా పెట్టి స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ని ఏర్పాటు చేసి గంజాయి ముఠాను అంతం చేసే పనిలో పడ్డారు. ఒరిస్సా రాష్ట్రం నుంచి వచ్చే రైలుపై ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు చేస్తున్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఒంగోలు రైల్వే స్టేషన్లో ఆ శిక్షణ ఇచ్చిన జాగిలం ద్వారా రైల్లోకి ఎక్కి జనరల్ కంపార్ట్మెంట్‌లతోపాటు రిజర్వేషన్ల కంపార్ట్మెంట్లను సైతం తనిఖీలు చేయడం మొదలు పెడుతున్నారు. ఆ జాతిలో వెళ్లి ఆ గంజాయి రవాణా చేసే ముఠా వద్దకు వెళ్లి గంజాయిని పట్టి వేయడం జరుగుతుంది. ఒరిస్సా రాష్ట్రం నుంచి ఈ గంజాయి ముఠా చెన్నైకి తరలించుకొని పోతూ మార్గమధ్యంలో నెల్లూరులో దిగి ఆ గంజాయిని అక్కడ అమ్మకాలు చేపడుతున్నారని పోలీసులకు సమాచారాలు రావడంతో పోలీసులు వెంటనే రైలులో నిఘా పెట్టి తనిఖీలు చేస్తున్నారు. హౌరా టు తిరుపతి రైల్లో నిత్యం తనిఖీలు చేస్తూనే ఉన్నారు. ఆ రైలుతోపాటు ఎర్నాకులం ఎక్స్ప్రెస్‌ను కూడా ఇటీవల తనిఖీలు చేయడంతో ఒరిస్సా నుంచి గంజాయితో చెన్నై వెళ్తున్న ముఠా దొరికింది.

14 మందిపై 10 కేసులు.. 100 కేజీల గంజాయి పట్టివేత

గత మూడు నెలలుగా రైలులో గంజాయి రవాణా చేస్తున్న 14 మందిని అదుపులోకి తీసుకోగా ఈ 14 మంది చెన్నై రాష్ట్రానికి చెందిన వారు. వీళ్లంతా ఒరిస్సా ప్రాంతానికి వెళ్లి గంజాయి తీసుకొని వచ్చి నెల్లూరులో గంజాయి అప్పగించడం జరుగుతుంది. వీరిపై ఇప్పటికి 10 కేసులు నమోదు చేసి 100 కేజీల గంజాయిని ఒరిస్సా నుంచి తమిళనాడు వైపు వెళుతున్న సమయంలో బెంగళూరు ఎక్స్ప్రెస్, హౌరా ఎక్స్ప్రెస్, ఎర్నాకులం ఎక్స్ప్రెస్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకోవటం జరిగింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులతోపాటు రైల్వే జిఆర్పి పోలీసులు కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఇటీవల కాలంలో గంజాయిపై నిఘా పెంచారు. వారానికి ఒకసారి రైలులో తనిఖీలు చేస్తూ గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నారు.

జిల్లా టెన్నికాయిట్ జట్టు

టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రకాశం జిల్లా టెన్ని కాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్ల ఎంపిక శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో ఆదివారం నిర్వహించారు. ప్రకాశం జిల్లా నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేశారు. వీరు ఈ నెల 20, 21వ తేదీ శ్రీకాకుళం జిల్లాలో సబ్ జూనియర్ కేటగిరిలో ప్రకాశం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎన్‌టి.ప్రసాద్, ట్రెజరర్ కందికట్ల శంకర్రావు, నామా చంద్రశేఖర్, నాగేశ్వరరావు, సురేష్, మౌలాలి పాల్గొన్నారు.

కుళాయిని ప్రారంభిస్తున్న కేలం ఇంద్రభూపాల్ రెడ్డి

సొంత నిధులతో ఇంటింటికీ కుళాయి

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం రామగోపాలపురం పంచాయతీలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు పార్టీ గ్రామ అధ్యక్షులు దేవిరెడ్డి రామిరెడ్డి తన సొంత నిధులు దాదాపు ఒక లక్ష రూపాయల ఖర్చుతో 40 ఇళ్ళకి తాగునీటికి ఇబ్బంది లేకుండా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేశారు. అదివారం మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డిలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవిరెడ్డి రామిరెడ్డి తన సొంత నిధులతో పంచాయతీ అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి మీనిగా కాశయ్య, మండల తెలుగు యువత అధ్యక్షులు బొబ్బ రమణారెడ్డి, మాజీ మండల తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర రెడ్డి, కెఎస్ఎస్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కంకణాల కృష్ణమోహన్

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో స్వచ్ఛంద సంస్థ మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించి 32 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కంకణాల కృష్ణ మోహన్, ఆసుపత్రి సిబ్బంది శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ 40 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరు షుగరు, బిపి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రజలు ప్రశాంత జీవితం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రామస్తులు బొక్కిసం సుబ్బారావు, రావెళ్ళ చెంచయ్య, మానికొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-దర్శి

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కార్యాలయంలో దర్శి ఎస్ఐ మురళి చేతుల మీదగా ఆవిష్కరించారు. ప్రముఖ సంఘ సేవకులు జివి.రత్నం మాట్లాడుతూ రాష్ట్రదళితసేన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల26వ తెదిన దర్శిలో ఎంపిడిఓ కార్యలయంలో భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన 76వ రాజ్యాంగ అమోదసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళితసేన దర్శి నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గర్నెపూడి ప్రేమ్‌కుమార్, రాచపూడి మోషే, కుమ్మరికుంట సత్యం, గట్టుపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారమే లక్ష్యంగా ఎగ్‌కార్టుల ఏర్పాటు

మహిళలకు పంపిణీ చేసిన మంత్రి స్వామి

ఎగ్‌కార్టును ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర గ్రామీణాభివద్ధి శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సహకారంతో కొండపి నియోజకవర్గంలోని లబ్ధిదారులకు తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో ఎగ్‌కార్ట్స్ తోపుడు బండ్లను ఆదివారం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల్లో ఆర్థిక పరిపుష్టిని, సామాజిక భద్రత దిశగా పౌష్టికాహారం అందించే లక్ష్యంతో డిఆర్డిఏ వెలుగు స్వయం సహాయక బృంద మహిళలకు ఎగ్‌కార్ట్ తోపుడు బండ్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.50 వేల ఆర్థిక సాయం చేస్తుందన్నారు. ఈ ఎగ్‌కార్ట్స్ ఏర్పాటు ద్వారా కోడిగుడ్లు వాటి ఉత్పత్తులను మహిళలు వినియోగించి వారిలోని పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక ఎగ్ కార్ట్స్ బండి ఏర్పాటుకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని, రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెంచుతామన్నారు. మహిళలు స్వయం ఉపాధికి ఎగ్ కార్ట్స్ ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టంగుటూరు మండల అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖర్, జరుగుమల్లి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, టంగుటూరు మాజీ సర్పంచి బెల్లం జయంతి బాబు, నల మోతు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-సిఎస్‌పురం

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం-2025 కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఒంగోలు వారు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తాన్ని సేకరించారు. సుమారుగా 200 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్-ఎస్ ఇంచార్జి స్టెఫి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మాట్లాడుతున్న యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ కుమార్

పేదలకు అండగా నిలవాలి

ప్రజాశక్తి-దర్శి

పేద ఆర్యవైశ్యులకు అందరం అండగా ఉండాలని, విద్య, వైద్యానికి సహకరించాలని యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పులిపాడు సమీపాన ఉన్న శివాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా పాల్గొని శిద్దా సుధీర్‌కుమార్‌తో పాటు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు సుబ్బారావు, రాష్ట్ర నాయకులు పల్లెబోతు వెంకటేశ్వరరావు, మోతుకూరి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు మువ్వల శ్రీనివాసరావు, లక్ష్మి నరసింహారావు, కనుమల్లపూడి లక్ష్మీ, మోహన్‌లు ప్రసంగించారు. మండల అధ్యక్షుడు భూమా సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భారీగా అన్నదానం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి ఐ.రామాంజనేయులు, కోశాధికారి సాయి కుమార్, సూరె చిన్నసుబ్బారావు, కోటా హనుమంతరావు, కొల్లా భాస్కర్, ఒగ్గు పవన్, మునగ ఆంజనేయులు, దేవతి మహా నంది, అచ్యుత ప్రకాష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గుండ్లకమ్మ వద్ద వనభోజనాలు

వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలను సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-మద్దిపాడు

రెడ్డి జనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ వేడుకకు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, బత్తుల బ్రహ్మానంద రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సామాజికవర్గంలో వెనుకబడిన వారందరికీ ఆర్థిక చేయూత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ముందుగా వారికి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. యాదవ కార్తీక వనభోజనాలకు రాష్ట్ర బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందరూ ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. గుండ్లకమ్మ డ్యాం వద్దకు వచ్చే దారిలో వెల్లంపల్లి గ్రామంలో మల్లెబోయిన వెంకటేశ్వర్లు నివాసం వద్ద అల్పాహారం చేశారు.

కర్తార్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ కార్యకర్తలు

కర్తార్ సింగ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - రేపల్లె

భారత స్వతంత్ర విప్లవ వీరుడు కర్తార్‌సింగ్ సరభకు డివైఎఫ్ఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కొరటాల సత్యనారాయణ మీటింగు హాలులో కర్తార్ సింగ్ సరభా చిత్ర పటానికి డివైఎఫ్ఐ అధ్యక్షులు సిహెచ్ ప్రకాష్ పూల మాలతో నివాళులర్పించారు. అనంతరం డివైఎఫ్ఐ కార్యదర్శి కెవి లక్ష్మణరావు మాట్లాడుతూ భారతీయ విప్లవ కారుడు కర్తార్‌సింగ్ భగత్ సింగ్‌కు స్ఫూర్తిగా నిలిచాడని అన్నారు. అతను 1915 నవంబర్ 16న తన 19 ఏళ్ల వయసులో బ్రిటిష్ ముష్కరులచే ఉరితీయబడ్డారని చెప్పారు. అతను గదర్ పార్టీలో ప్రముఖ సభ్యుడని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడని కొనియాడారు. ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన అతను బ్రిటిష్ అణచివేత గురించి తెలుసుకొని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. 1913లో గదర్ పార్టీలో చేరి బ్రిటిష్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి సాయుధ తిరుగుబాటును ప్రకటించాడని, గదర్ వార్తాపత్రిక పంజాబీ ఎడిషన్‌ను ప్రచురించడంలో సహాయపడ్డాడని చెప్పారు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు అతను భారతదేశానికి తిరిగి వచ్చి స్వాతంత్ర్య ఉద్యమం కోసం సైనికులను, రైతులను ఏకం చేయడానికి కృషి చేశాడని అన్నారు. లాహోర్ కుట్ర కేసులో అరెస్ట్ చేయబడ్డారని తెలిపారు. విచారణ సమయంలో అతను ఏమాత్రం పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదని, 1915 నవంబర్ 16న అతన్ని ఉరితీశారని తెలిపారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ దేశ సంపూర్ణ స్వతంత్రం కోసం, నాణ్యమైన విద్య, అందరికీ ఉపాధి కోసం డివైఎఫ్ఐ నడిపే పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎ రత్నాకర్, వై నవీన్, రత్నబాబు, సూర్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ

డాక్టర్ ప్రసాద్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - నగరం

స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల నందు రేపల్లె తాలూకా ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్ 4వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో ఎంసిఎ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్ చేసిన కృషి ఎనలేనిదని ప్రశంసించారు. కళాశాలను నూతన పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రసాద్ అవిరళ కృషి చేశారని అన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ప్రసాద్ ఆశీస్సులతో కళాశాల అభివృద్ధికి నిరంతర కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి శ్రీనివాసరావు, ప్రసన్న బాబు, సూపర్డెంట్ అమరేష్‌రెడ్డి, డాక్టర్ ప్రకాష్ బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

23 నుండి అంతర్ జిల్లా ఆటల పోటీలు

ప్రజాశక్తి - పంగులూరు

69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లా ఆటల పోటీలు ఈనెల 23 నుండి 26 వరకు మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరుగుతాయని ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రటరీ కె ప్రతిమ ఆదివారం తెలిపారు. యోగాసన పోటీలు, సెలక్షన్లు ఉంటాయని అన్నారు. అండర్ 14, 17, 19 కేటగిరిలో బాల, బాలికల పోటీలు జరుగుతాయని తెలిపారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి

ప్రజాశక్తి - బాపట్ల

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని డాక్టర్ దొప్పలపూడి మల్లికార్జునరావు సైన్స్ మ్యూజియం నిర్వాహకులు దొప్పలపూడి రామ్మోహనరావు అన్నారు. పట్టణంలోని ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో డాక్టర్ దొప్పలపూడి మల్లికార్జునరావు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ సందర్భంగా నిర్వహిం చిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్స వంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న పట్టణంలో విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అంద జేశారు. సభకు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె నాగేశ్వర రావు అధ్యక్షత వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు జవహర్ లాల్ నెహ్రూ స్ఫూర్తితో ఉన్నత చదువులు చదవాలని కోరారు. డాక్టర్ దొప్పలపూడి మల్లికార్జున రావు ఆ రోజుల్లోనే వైద్య విద్య చదివి బాపట్ల ప్రాంతం లో పేద ప్రజలకు వైద్యసేవలు అందిస్తూ పేదల డాక్టర్‌గా సమాజం కోసం కృషి చేశారని అన్నారు. కష్టపడి చదివి

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న నిర్వాహకులు

తల్లిదండ్రులు, గ్రామాలకు మంచి పేరు తేవాలని అన్నారు. పిల్లలను స్వేచ్ఛాయుత వాతావ రణంలో మానసిక ఉల్లాసం కలిగి ఉండాలని, క్రీడల్లో రాణించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని అన్నారు. భవిష్యత్తులో పట్టణంలో పేదలకు ఉచిత వైద్య శిభిరాలు నిర్వహించే విధంగా డాక్టర్ దొప్పల పూడి మల్లికార్జునరావు విజ్ఞాన కేంద్రం పనిచేస్తుందని అన్నారు. విజ్ఞానం, వినోదం కల్పించే విధంగా విజ్ఞాన కేంద్రం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ .శ్రీనివాసరావు, జెవివి నాయకులు వై భాస్కరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి టి సుభాషిణి, సిఐటియు కార్యదర్శి కె శరత్ పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు జమ చేయాలి

సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి కృష్ణమోహన్

ప్రజాశక్తి - బాపట్ల

టి కృష్ణమోహన్

పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రెండు విడతలగా విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.959 కోట్లు తక్షణమే గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి కృష్ణమోహన్ కోరారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. స్థానిక సంస్థల కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసి నెల రోజులైందని తెలిపారు. అన్‌టైడ్ కింద రూ.410 కోట్లు, రెండు రోజుల క్రితం టైట్ గ్రాంట్ కింద రూ.548 కోట్లు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం విడుదల చేసినట్లు తెలిపారు. ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంచాయతీల ఖాతాల్లో జమచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. స్థానిక సంస్థల్లో గత ప్రభుత్వంలో పంచాయతీలు నిధులు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని అన్నారు. కరోనా కాలంలో పంచాయతీల్లో బ్లీచింగ్ చల్లించటానికి సైతం నిధులు లేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతం కన్నా కొంత మెరుగ్గా ఉన్నా గతంలో వచ్చిన నిధులు అనేక నెలలు విడుదల చేయలేదని అన్నారు. సర్పంచులు పార్టీలకు అతీతంగా ఆందోళన చేసిన నేపథ్యంలో నిధులు విడుదల చేసినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ చూపి కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధులు పంచాయతీలు, స్థానిక సంస్థల ఖాతాల్లో జమయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. పంచాయతీలకు రావాల్సిన రిజిస్ట్రేషన్ చార్జీలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో సర్పంచుల గౌరవ వేతనం, పంచాయతీలకు బడ్జెట్లో నిధులు పెంపుదల చేస్తామన్న హామీ అమలు చేయాలని కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - రేపల్లె

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సెలవు రోజైన ఆదివారం కూడా విద్యా సంస్థలు నిర్వహిస్తుం డటంతో ఎస్ఎఫ్ఐ నేతలు మూసివేయించారు. చర్యలు తీసుకోవలసిన విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పట్టణంలోని ప్రవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం, మౌంట్ఫోర్ట్, ఆర్‌కె మోడల్, రాఘవ, వివేకానంద పాఠశాలలు, శ్రీ చైతన్య కాలేజ్ నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తుండటంతో ఎస్ఎఫ్ఐ బృందం పర్యటించి తరగతులు మూయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎం సూర్య ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ ర్యాంకుల కోసం సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వారంలో 6రోజులు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ర్యాంకుల కోసం విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. పండుగలు, ఆదివారాలు సెలవు ఇవ్వకుండా

ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. స్టడీ అవర్స్ పేరుతో రాత్రి 8.30 వరకు తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు రాత్రి సమయంలో ఇంటికి వెళ్లడానికి ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మానసిక ఉల్లాసానికి దూరమై అనేక మంది విద్యార్థులు ప్రవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలలో ఆత్మ హత్యలు చేసుకుంటున్నారని అన్నారు. విద్యాశాఖ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులైన స్పందించి సమస్య పరిష్కారం చేయాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి వై నవీన్, ప్రశాంత్, సంజయ్, సుమంత్, శరత్ పాల్గొన్నారు.

జర్నలిస్టు ఓర్సు కొండలును సన్మానిస్తున్న మంత్రి రవికుమార్

నిష్పక్షపాత జర్నలిజమే పేదలకు రక్షణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

నిష్పక్షపాత జర్నలిజం సజీవంగా నిలుస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. 60వ జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా మండలంలోని పుట్టావారి పాలెం సమీపంలోని గొట్టిపాటి అతిథి గృహంలో ప్రజాశక్తి విలేఖరి ఓర్సు కొండలును ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. పాత్రికేయులు పత్రిక విలువలకు కట్టుబడి పనిచేయాలని అన్నారు. రామోజీరావు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. జర్నలిజం సజీవంగా ఉన్నప్పుడే సామాన్యుడు స్వేచ్ఛగా బ్రతక గలుగుతాడని అన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సంతమాగులూరు అధ్యక్షులు కంచర్ల సుబ్బారావు, సహాయ కార్యదర్శి షేక్ నాగూర్ వలి, జర్నలిస్ట్ బి కృష్ణారెడ్డి, ప్రెస్ క్లబ్ ట్రెజరర్ మొగిలి సుబ్బారావు, కార్యదర్శి కాలేశావళి, పి బాల ఆంజనేయులు, బి వెంగళరెడ్డి, ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్, టిడిపి మండల అధ్యక్షులు చేవూరి వాసురెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు సన్నెబోయిన గురుబ్రహ్మం, మాదాల సుబ్బారావు, కొనికి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంగులూరు : విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో విలేకరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పత్రికా రంగంలో సేవలు అందిస్తున్న సిహెచ్ మధుసూదనరావు, ఎం నాగేశ్వరరావు, ఎం వెంకటేశ్వర్లు, జి చంద్రయ్య, ఎం శ్రీహర్షను సన్మానించారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు తక్కెళ్ళపాటి రామకృష్ణ, కార్యదర్శి తక్కెళ్ళపాటి నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కోటప్పకొండలో భోజనాలు చేస్తున్న ప్రజాశక్తి పాఠకులు

'ప్రజాశక్తి పాఠకుల' యాత్ర

ప్రజాశక్తి - పంగులూరు

ప్రజాశక్తి పాఠకుల యాత్ర ఆదివారం అత్యంత ఉత్సాహంగా జరిగింది. కోటప్పకొండలోని వివిధ ప్రదేశాలు సందర్శించారు. ఐక్యంగా భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. ఆదివారం ఉదయం అద్దంకి నుండి కోటప్పకొండ వెళ్లారు. కొమ్మలపాడు, కొప్పరం, బండివారిపాలెం, మిన్ని కల్లు, పమిడిపర్రు, మీదగా కోటప్పకొండకు చేరుకున్నారు. 40 మంది పాఠకులు పాల్గొన్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం సోషల్ మీడియా రాష్ట్ర బాధ్యులు కారుసాల శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు రఘు చందు, ప్రజాశక్తి బాధ్యులు బి విజయ్ కుమార్ మాట్లాడారు. కోటప్పకొండపై వనవిహారి, బాలానందం పార్కు సందర్శించారు. పార్కులో పిల్లలతో పాటు ఆనందగా గడిపారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

ప్రజాశక్తి - యద్దనపూడి

ఏసుపాదం

మండలంలోని అనంతవరంకు చెందిన వైరంగం ఏసుపాదం గుండె సంభంద వ్యాధితో బాధపడున్నారు. అతని గుండె నాలుగు వాల్స్ మూసుకుపోయాయి. అతనికి ఎబి నెగిటివ్ రక్తం కావాల్సి ఉంది. అతనికి బైపాస్ సర్జరీ చేయాలంటే ఆరు నుండి ఎనిమిది మంది మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు వచ్చి రక్తం ఇవ్వాలని డాక్టర్స్ చెప్పారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఆపరేషన్ జరుగుతూ ఉండగా లైవ్‌లో రక్తం కావాలని డాక్టర్స్ చెప్పినట్లు చెప్పాడు. అతనికి 6 నుండి 8 బాటిళ్ళ రక్తం అవసరమని వైధులు తెలిపారు. తాను పని చేస్తేనే కుటుంబం నడుస్తుందని తెలిపారు. తన గ్రూప్ ఎబి నెగిటివ్ రక్తం కలిగిన దాతలు వచ్చి తనకు రక్తం ఇచ్చి తన ప్రాణాలు కాపాడి తన కుటుంబానికి, తన పిల్లలకు

వధూవరులకు గవర్నర్ ఆశీర్వాదం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ కుమారుడు రాకేష్ వర్మ-రూప నాగదేవికల వివాహ రిసెప్షన్ బాపట్లలో ఆదివారం జరిగింది. నూతన వధూవరులను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్, ఇతర ప్రముఖులు ఆశీర్వదించారు. ఒక రోజు పర్యటనలో భాగంగా బాపట్ల మండలం, పాండురంగాపురం గోల్డెన్ సాండ్స్ 5స్టార్ హెూటల్‌కు ముందుగా గవర్నర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహే శ్వర్ పూలమొక్కలు అందజేసి.. గవర్నర్‌కు స్వాగతం పలికారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సంయుక్త కలెక్టర్ భావన, బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే నరేంద్రవర్మ, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, డిఎస్పీ రామాంజ నేయులు, బాపట్ల, చీరాల తహశీల్దార్లు షేక్ సలీమ, గోపి కష్ణ, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ద్వారకా నగర్, సమతా నగర్, లింగారెడ్డి కుంట, మిల్క్ ప్రాజెక్ట్, పీర్ల మాన్యం, అరుణోదయ కాలనీ, టీచర్స్ కాలనీ, జెడ్ పి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం కలదని టౌన్ విద్యుత్ డి.ఇ.ఇ. కె.వి.పి. రంగారావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇదేం 'మోడల్' స్కూల్.?

- ఒక గదిలోనే ఐదు తరగతులు
- మొత్తం రెండు బాత్‌రూమ్‌లే..
- మోడల్ పాఠశాలలో దయనీయ స్థితి..

మోడల్ పాఠశాలలోని విద్యార్థులు

మోడల్ పాఠశాల

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో ఉన్న నగర పాలక మున్సిపల్ మోడల్ ప్రత్యేక ప్రాథమిక పాఠశాల ఇదీ. ప్రాథమిక మోడల్ పాఠశాల అంటే జిల్లాకే నమూనా గా ఉంటుందని భావి స్తాము. ఇది పేరుకే మోడల్, ఆచరణలో వీధి బడి కంటే దారుణం అనే చెప్పాలి. తర గతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి తరగతికి ఒక డిజి టల్ క్లాస్ రూమ్, డిజిటల్ బోర్డు, కంప్యూటర్ ల్యాబ్, అదునాతనమైన సౌకర్యాలతో జిల్లా కే ప్రత్యేక ఆకర్షణగా అన్ని సొబగులతో మోడల్ గా నిలుస్తుందనుకుంటే పొరపాటే.!

ఒంగోలు నగరం లోని బాపూజీ మార్కెట్ ఏరియా (కోటకట్ట) ప్రాంతంలో నగర పాలక మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉంది. 1వ తరగతి నుంచి 5వరకు నిర్వహిస్తున్న పాఠశాల భవనం శిధిలావస్థకు చేరడంతో ఈ భవనాన్ని కూల్చి వేసి బలరాం కాలనీలో ఆగ్జిలియం యాజమాన్యం కు చెందిన ఒక భవనంలో అద్దె ప్రాతిపదికన ఏడాదిగా తరగతులు నిర్వహించ డం గమనార్హం. పేరుకు మోడల్ పాఠశాలగా నిర్వహిస్తున్న ఈ పాఠశాల మోడల్ కు వక్రభాష్యం చెబుతుంది మున్సిపల్ విద్యాశాఖ.

అయిదుగురు ఉపాధ్యాయులకు ముగ్గురే....

ఈ పాఠశాల సందర్శకులకు కొత్త నమూనాగా అగుపిస్తుంది. 1నుంచి 5 తరగతులు నిర్వహించే పాఠశాలలో 81మంది విద్యార్థులుండగా అయిదుగురు ఉపాధ్యాయులకు ముగ్గురే పని చేయడం గమనార్హం. అదికూడా ఇటీవల ఒక రెగ్యులర్ టీచర్ ను నియమించగా ఇద్దరు ఉర్దూ పాఠశాల నుంచి డిప్యుటేషన్ పై కేటాయించారు.. ఒకే చోట 5తరగతులు నిర్వహించడం, అక్కడే బాలబాలికలకు ప్రత్యేక బాత్ రూమ్స్ ఏర్పాటు చేయడం గమనార్హం. తగినన్న బల్లలు ఉన్నప్పటికీ తగినంత చోటు లేక కొన్ని బల్లలు కుప్పగా పోసి పక్కన బెట్టారు. గో డౌన్ కు ఉపయోగించే కొద్ది స్థలం లో నిర్మించిన ఈ భవనం పై కప్పు నుంచి ఎండ తీవ్రతకు సీలింగ్ గా వేసిన ధర్మకోల్ ఊడి పోతుంది. ఇదిలా ఉండగా నీటి అవసరతకు నిర్దేశించిన విద్యుత్ మోటారు తరగతి గదిలో ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదం పొంచి వుంది. మొన్న మొంథా తుఫాన్ కు పాఠశాలకు మూడడుగులు వరద నీరు చేరడం, వరద తగ్గాక పాఠశాల తెరచిన క్రమంలో వరద నీటికి తడిసిన విద్యుత్ మోటార్ షాక్ రావడం గుర్తించిన ఉపాధ్యానీలు తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదం తప్పింది. స్వయంగా విద్యా శాఖను ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు తనయుడు లోకేష్ బాబు పర్యవేక్షిస్తున్నప్పటికీ ఆచరణకు అమలుకు ఉన్న వ్యత్యాసం మనం అర్థం చేసుకోవచ్చు.

సొంత భవనం శిధిలావస్థకు చేరడంతో..

టి కిషోర్ బాబు, ఎంఇఒ

పాఠశాల సొంత భవనం శిధిలావస్థకు చేరడంతో దాన్ని కూలగొట్టి ఆగ్జిలియం యాజమాన్యం కు చెందిన భవనం లో తాత్కాలిక పాఠశాల నిర్వహించడం జరుగుతుంది. అక్కడ అవసరం అయిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తాం

కేరళ తరహా మోడల్ అమలు చేయాలి..

చీకటి శ్రీనివాసరావు, సిపిఎం నగర కార్యదర్శి

పాఠశాల విద్యకు కేరళ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, దీనికి నిదర్శనం దేశంలోనే మొదటి ప్రభుత్వం ఏసీ పాఠశాలను ప్రారంభించిన వైనాన్ని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధులకు కేటా యించిన నిధులు, మున్సిపల్ శాఖ నిధులు వెచ్చించి భవనం నిర్మించిన అంశాన్ని ఉటంకించారు. ఎసి పాఠశాలలు నిర్మించక పోయినా మౌళిక సదుపాయాలు కల్పించాలి. విద్యావ్యవస్థలో కేరళ నమూనాను అమలు చేయాలి.

'మున్సిపల్ వర్కర్స్' రాష్ట్ర కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా నాగభూషణం, ఉమామహేశ్వరరావు
- 21 మంది ఆఫీస్ బేరర్స్ ఎన్నిక
- మరో 50 మందితో రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా కె.నాగభూషణం, కె.ఉమామహేశ్వరరావు తిరిగి ఎన్నికయ్యారు. మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 15వ రాష్ట్ర మహాసభలు ఒంగోలు కొత్త మార్కెట్ వద్ద జి.సుబ్బారావు నగర్‌లో నవంబర్ 15-16 తేదీల్లో ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు మున్సిపల్ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర చర్చలు జరిపిన ఈ మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలకు తొలి రోజు ఎంఎల్‌సి బి.గోపిమూర్తి, శనివారం, ఆదివారం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు ముఖ్య అతిథులుగా హాజరై శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

మహాసభల్లో జరిగిన ఎన్నికల్లో కె.నాగభూషణం (అనంతపురం) రాష్ట్ర అధ్యక్షుడిగా, కె. ఉమామహేశ్వరరావు (సెంటర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎస్.జ్యోతిబసు (ఎన్‌టిఆర్) ఎన్నికయ్యారు. మొత్తం 21 మంది ఆఫీస్ బేరర్స్, 50 మంది రాష్ట్ర కమిటీ సభ్యులతో కూడిన కొత్త రాష్ట్ర కమిటీని సభ ప్రకటించింది. ఉపాధ్యక్షులుగా టి.నూకరాజు (విశాఖ), యన్.వై.నాయుడు (పార్వతీపురం మన్యం), పి.వెంకటరెడ్డి (విశాఖ), సునీల్ (నెల్లూరు), ధనాల వెంకట్రావు (పశ్చిమగోదావరి), విజయ (ప్రకాశం), కో-ఆప్షన్, యన్.టి.ఆర్ మహిళ - కో-ఆప్షన్, గుంటూరు - కో-ఆప్షన్, కార్యదర్శులుగా ఉరుకూటి రాజు (విశాఖ), ఎస్.ఇందీవర (విశాఖ) కె.శ్రీనివాసరావు (ప్రకాశం), వైవి ప్రసాదరావు (విశాఖ), ఎస్ఎస్ చెంగయ్య (గుంటూరు), లక్ష్మీనారాయణ (సత్యసాయి), జ్యోతిబసు (యన్.టి.ఆర్) కడప - కో-ఆప్షన్, యన్.టి.ఆర్- కో-ఆప్షన్ ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా మున్సిపల్ పిల్ వర్కర్లు ఎదుర్కొంటున్న వేతన సమస్యలు, పెన్షన్, శానిటేషన్ కార్మికులకు రక్షణ పరికరాల కొరత, కాంట్రాక్టు-ఔట్‌సోర్సింగ్ విధానంలోని అన్యాయం వంటి అంశాలపై మహాసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కార్మికుల హక్కుల రక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధతం చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది. సమాజ ఆరోగ్యంలో కీలకపాత్ర పోషిస్తున్న మున్సిపల్ వర్కర్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని, వారి జీవనోపాధి భద్రత కోసం ప్రత్యేక నిధులు, శాశ్వత ఉద్యోగాలు, ప్రమాద భత్యాలు కల్పించాలని ఫెడ రేషన్ తీర్మానించింది. కొత్తగా ఎన్నికైన కమిటీ రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై ఐక్య పోరాటాలను బలోపేతం చేస్తుందని కమిటీ ప్రకటించింది.

'మున్సిపల్ వర్కర్స్' ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ

క్యూబా కోసం మహాసభకు వచ్చిన కార్మికులు ఇచ్చిన నగదును జిల్లా నాయకులు రాష్ట్ర నాయకత్వానికి అందజేస్తున్న దృశ్యం

పలువురు సౌహార్ధ సందేశాలు...

ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, ఎ పి మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, ఎపి మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్, కెవిపిఎస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి కల్పన, బి రఘురామ్ సౌహార్ధ సందేశం ఇచ్చారు. ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా భారీ ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రజారోగ్యశాఖలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల ఆందోళనకు తాము సంఘీభావం వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటించారు. మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర నాయకురాలు పి.కల్పన, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు బి రఘురామ్ ఉద్యమానికి అండగా నిలుస్తామని ప్రకటించారు.

క్యూబా కోసం మహాసభకు వచ్చిన కార్మికులు ఇచ్చిన నగదును జిల్లా నాయకులు రాష్ట్ర నాయకత్వానికి అందజేశారు. మహాసభకు సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం, ఉపాధ్యక్షులు టి నూకరాజు, కె సామ్రాజ్యం, ధనాల వెంకటరావు, టి వజ్రమ్మ, టి తిరుపతమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సభలో మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం రమేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు,సంఘ ఉపాధ్యక్షులు కె సామ్రాజ్యం, టి నూకరాజు, పి వెంకటరెడ్డి, ఎన్ వై నాయుడు, కార్యదర్శులు వరికూటి రాజు, బి ముత్యాలరావు, కె పెంచలనరసయ్య, ఎస్ జ్యోతి బసు, సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి మహేష్, మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఇసుక రవాణా'లో అక్రమ వసూళ్లు

లంక గ్రామాల్లో చిధ్రమవుతున్న రహదారులు

ప్రజాశక్తి - వేమూరు

ప్రభుత్వం నిర్మాణాల కోసం ఇసుక ఉచితంగా తీసుకువెళ్లే పాలసీని ప్రవేశపెట్టింది. కానీ ఏ ఒక్కరూ ఇసుక ఉచితంగా తీసుకువెళ్లే పరిస్థితి లేదు. ఈ పాలసీ ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తుంగలో తొక్కి అక్రమార్కులు ఇసుక మాఫియాకు తెర లేపారు. రాత్రి అనకా, పగలనకా వందల ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమ వసూళ్లు చేస్తున్నారు. గ్రామాల సరిహద్దుల పేరిట ఒక గ్రామంలోని వాళ్లు మరొక గ్రామానికి రావడానికి వీలు లేదంటూ గొడవలు, కొట్లాటకు దిగుతున్నారు. ఈ ఘటన కొల్లూరు మండలం పెసర్లంక, చింతలంక గ్రామాల్లో నెలకొంది. అక్రమ వసూళ్లు చేపట్టిన ఇసుక తరలింపు కారణంగా నదీ గర్భంలోని గ్రామాలతో పాటు ఈ ప్రాంతంలోని అరవింద వారధికి కూడా ముప్పు పొంచి ఉందని పలువురు నిపుణులు చెబుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు వారధికి సమీపంలో ఇసుకలో తరలించటంతో వంతెన ప్రమాదానికి గురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని అంటున్నారు. ఈ ప్రాంతంలో అక్రమార్కులు ఎక్కడ ఇసుక కనిపిస్తే అక్కడ తరలించటంతో వరదల సమయంలో పంట భూములు కోతకు గురై నదీ గర్భంలో కలిసిపోతున్న ఘటన ఉన్నాయి. ఇటీవల కృష్ణా నదికి సంభవించిన వరదలకు కొల్లూరు, భట్టిప్రోలు, కొల్లిపర్ర మండలాల్లో నదిని ఆనుకుని ఉన్న సారవంతమైన సాగుభూములు ఎకరాల కొద్ది విరిగి నదిలో కలిసిపోయాయి. ఎలాంటి ప్రభుత్వ నిబంధనలు ఇక్కడ పాటించడం లేదు. కొందరు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పొంచి ఉన్న ప్రమాదాల దృష్ట్యా గ్రామస్తులు, రైతులు ఉన్నతాధికారులకు

అధికారులు నిలిపివేసిన ఇసుక ట్రాక్టర్లు

ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. నిత్యం కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణా కారణంగా అరవింద వారధిపై సుమారు నాలుగు అంగుళాల మందంలో ఇసుక పేరుకుపోయింది. దీంతో వాహన చోదకులకు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ వంతెనపై వేగంగా ద్విచక్ర వాహనాలు ప్రయాణిస్తే ఇసుకలో తిరగబడి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు ఉన్నాయి. పచ్చని వాణిజ్య పంటలతో కలకలలాడే లంక గ్రామాల ప్రజలకు ఇసుక అక్రమ రవాణాతో భవిష్యత్తులో తీవ్ర సంక్షోభాలు ఎదుర్కోవాల్సిన దుస్థితి కనిపిస్తుందని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ఇసుక అక్రమ రవాణ

ఇసుక రవాణా కారణంగా ఏడు లంక గ్రామాలకు ప్రయాణించే ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంటలు మయంగా ఏర్పడ్డాయి. దీనికి తోడు నిత్యం ప్రయాణించే ఇసుక ట్రాక్టర్లతో ఆయా గ్రామాల్లో ప్రజలు రహదారుల పైకి రావడానికి జంకుతున్నారు. నిమిషానికి ఒక ట్రాక్టర్ ఈ ప్రాంతంలో ప్రయాణిస్తుండటంతో గ్రామస్తులు ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయంతో గురవుతున్నారు. ఈ రహదారి వెంట దుమ్ము, దూళి లెగిసి ఇళ్లను చుట్టు ముడుతుందని, దుమ్ము కారణంగా శ్వాసకోశ వ్యాధులకు గురై చికిత్సలు పొందుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు 'మామూలు'గా సరిపెడుతున్నారే తప్ప పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉచిత ఇసుక పుణ్యమా అంటూ లంక గ్రామాల్లో కొల్లూరు నుండి గాజులంక, చింతలంక వరకు ప్రజలు శాంతియుతంగా నివసించే పరిస్థితులు కనిపించటం లేదని వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాతో అధికార పార్టీకి చెందిన నాయకులు రూ.లక్షలు పోగేసుకుంటున్నారే తప్ప గ్రామల్లో చిత్రమవుతున్న రోడ్ల గురించి, శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్న ప్రజల గురించి, నదిని ఆనుకొని ఉన్న సారవంతమైన భూములు పాడవుతున్న పరిస్థితులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నిస్తున్నారు.

అక్రమ వసూళ్లలో నెలకొన్న విభేదాలు

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల నుండి పలువురు నాయకులు ట్రాక్టరకు రూ.200 నుండి రూ.500 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారు. ఈ వసూళ్ల పంపకాల్లో విభేదాలు తారాస్థాయికి చేరాయి. కొట్లాటలు, గొడవలకు దారితీసాయి. ఇరువర్గాల మధ్య నెలకొన్న గొడవలతో పరిస్థితి చేయి జారిపోవడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు కళ్ళు తెరిచారు. ఇక్కడ నెలకొన్న సమస్యల దృష్ట్యా నదిలో నుండి ఇసుక తరలిస్తున్న 100 ట్రాక్టర్లకుపైగా పట్టుకొని పోలీసులు నిలిపేసి పక్కకు తరలించారు. అక్రమ వసూళ్లలో ఎదురవుతున్న వివాదాలు పరిష్కరించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారే తప్ప అక్రమ రవాణాతో గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై ఎందుకు దృష్టి సారించడం లేదని లంక గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, అక్రమ తరలింపుకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

యుద్ధ ప్రాతిపదికన కాలువల మరమ్మతులు

- తుఫాను వరదలతో 67 చోట్ల కాల్వకు గండ్లు
- ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో మరమ్మతులు
- 67 పనులకు రూ 3.54 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రధాన కాలువకు నీళ్లు విడుదల

ప్రజాశక్తి - కారంచేడు

మొంథ తుఫాను ప్రభావంతో నియోజకవర్గంలోని కృష్ణా వెస్ట్రన్ డెల్టా (కొమ్మమూరు) కాలువకు ఏర్పడిన గండ్లు పూడ్చివేత పనులు నీటిపారుదల శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలతో అధికారులు ప్రధాన కాలువ నుండి ఉపకాలువల వరకు శరవేగంగా మరమ్మత్తులు చేస్తున్నారు. తుఫాను ఉధృతికి 67 ప్రాంతాల్లో కాలువలకు గండ్లు ఏర్పడ్డాయి. వాటన్నింటినీ పూడ్చివేతకు రూ3.54 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అత్యవసర పనులుగా అధికారులు గుర్తించారు. ఈపాటికే వంతెన కింద, కుంకలమర్రు, కారంచేడు, సాకి, స్వర్ణ, సంతరావురు, తిమ్మసముద్రం వరకు ప్రధాన కాలువపై గండ్లు పూడ్చివేత పనులు వేగంగా

కాలువ గండ్లు పూడుస్తున్న దృశ్యం

పూర్తి చేస్తున్నారు. శాశ్వత పరిష్కారం కోసం రూ.6 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు నీటిపారుదల అధికారులు తెలిపారు. ఉపకాలువల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయడంతో రైతులకు నీటి సరఫరా నిరవధికంగా కొనసాగుతున్నది. ప్రధాన కాలువ మరమ్మత్తులు పూర్తవడంతో కొమ్మమూరుకు నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సూచనలతో పంటకాలంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఏర్పడిందని అధికారులు తెలిపారు.

సూర్యలంకలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - బాపట్ల

కార్తీక మాసం ఆరంభం నుండే సముద్రంలో వాయుగుండాలు, అధిక వర్షాల కారణంగా సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానాలకు అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. చివరి ఆదివారం కావడంతో సూర్యలంక సముద్రస్నానాలకు పర్యాటకులు పోటెత్తారు. దీంతో సముద్రతీరం సందడి సందడిగా కనిపించింది. కొన్ని రోజులు విరామం తర్వాత బీచ్ ప్రవేశానికి అధికారులు అనుమతిచ్చారు. పది రోజుల నుండి సముద్ర స్నానానికి పర్యాటకులు వస్తున్నప్పటికీ చివరి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. బాపట్ల- సూర్యలంక రహదారి మార్గంలో అనేక చోట్ల ట్రాఫిర్ స్తంభించిపోయింది. రెడ్డి, కాపు వన సమారాధనలతో వాహనాలతో నిండిపోయింది. సముద్ర తీరానికి నేరుగా వాహనాల్లో చేరుకునే అవకాశం ఉండటం, ప్రమాద రహిత తీరంగా పేరు గడించటంతో సూర్యలంకను సందర్శించేందుకు

పర్యాటకుల సముద్ర స్నానాలు

రెండు తెలుగు రాష్ట్రాల నుండి పర్యాటరులు వస్తుంటారు. ప్రమాదాలను పసిగట్టి అరికట్టేందుకు సంఖ్య రోజు రోజుకు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు భద్రత పెంచారు. డిఎస్పి రామాంజనేయులు పర్యవేక్షణలో గట్టి పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. 20 బోట్లతో పరిస్థితి పర్యవేక్షించారు. సుమారు 200 మంది పోలీసులు, గజ ఈతగాళ్లు తీరంలో పహారాకాశారు.

సాంబిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అశోక్ బాబు

వైసిపి నాయకులు సాంబిరెడ్డికి నివాళి

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం వలివేరు వైసిపి సీనియర్ నాయకులు, పాల కేంద్రం ప్రెసిడెంట్ ఈమని శ్రీనివాసరెడ్డి తండ్రి ఈమని సాంబిరెడ్డి సంస్మరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వైసీపీ ఇన్‌ఛార్జి వరికోటి అశోక్ బాబు హాజరై సాంబిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

కొల్లూరులో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - కొల్లూరు

గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధికి సేవలు అందించిన మహనీయుడు, గ్రంథాలయ ఉద్యమ పితామహుడైన అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి గ్రంథాలయ అధికారి వై రాంబాబు పూల మాల వేసి నివాళులర్పించారు. సబ్ జూనియర్స్‌కు వెంకట రమణయ్య, జూనియర్స్‌కు పాతూరు నాగభూషణం, సీనియర్స్‌కు ఎస్ఆర్ రంగనాథన్ అనే అంశాలపై వకృత పోటీలు నిర్వహించారు. వీటికి ఎన్ శివరామకృష్ణ, పులివర్తి రాజేంద్ర బాబు, జూనియర్స్‌కు చైతన్య స్కూల్ ఉపాధ్యాయురాలు కె నాగలక్ష్మి న్యాయం నిర్ణేతులుగా పోటీలు నిర్వహించారు. అనంతవరం శాఖ గ్రంథాలయం నందు సర్పంచ్ అలపర్తి ఉషారాణి, పంచాయతీ సెక్రెటరీ ఉమామహేశ్వరరెడ్డి, గ్రామస్తులు నాగళ్ళ గంగాధరరావు, ధూళిపాల వెంకటేశ్వరరావు హాజరై విద్యార్థులకు డిబేట్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జి కనకదుర్గ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి అందజేస్తున్న ఆనందబాబు

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలానికి చెందిన నలుగురు అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నారు. చికిత్స కోసమైన బిల్‌ను శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సిఫార్సు మేరకు మంజూరైన సిఎం సహాయ నిధి రూ.2,47,510 చెక్కు రూపంలో బాధితుల కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి పాల్గొన్నారు.

మైనేనిని సత్కరిస్తున్న టిడిపి నాయకులు

'మైనేని'కి ఘన సత్కారం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని కాప్ర గ్రామ టిడిపి నాయకులు తలసిల పవన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం మండల అధ్యక్షులుగా 8వ సారి నియమితులైన మైనేని మురళీకృష్ణను ఆదివారం ఘనంగా సత్కరించారు. మురళీకృష్ణకు పుష్పగుచ్ఛమతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ మురళీకృష్ణ చేసిన అభివృద్ధి పనులను కొనియాడారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే నక్క ఆనందబాబు తనపై ఎంతో నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించారని అన్నారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా గ్రామాల్లో టిడిపిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, క్రాప పిఏసిఎస్ చైర్మన్ కోగంటి హరిప్రసాద్, గ్రామ అధ్యక్షులు నల్లూరి సత్యనారాయణ, సర్పంచ్ గోపయ్య, నాగరాజు, శ్యాంబాబు పాల్గొన్నారు.

కోట్ల ధీరజ్ పేరిట పురస్కారాలు

ప్రజాశక్తి - అద్దంకి

కోట్ల ధీరజ్ కథా పురస్కారం 2025కు 105 పుస్తకాలు వచ్చాయి. వీనిలో ప్రథమ బహుమతి కోసం ఎంబిఎస్ ప్రసాద్ రచించిన 'వశీకరణం' కథా సంపుటిని ఎంపిక చేశారు. వీరికి రూ.10వేల నగదు, ద్వితీయ బహుమతికి నల్లరేగడి నేలల్లో (పాలగిరి విశ్వప్రసాద్), పంకజం పదనిసలు (స్వరాజ్య పద్మజ కుందుర్తి), గారడీవాడు (మునిసురేష్ పిళ్లై), అలీబాబా అరడజను దొంగలు (దేశరాజు), మౌనం ఎరుపు (బి మురళీధర్) వేల్చేరు చంద్రశేఖర్ కథలు (వేల్చేరు చంద్రశేఖర్), నాతి చరామి (గొర్తి శ్రీనివాస్) కథా సంపుటులు ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి రూ.1116నగదు ఇవ్వనున్నారు. 30ఏళ్లుగా సాహిత్య సేవ చేస్తున్న టిఎస్ఎ కృష్ణమూర్తి రూ.3వేల నగదు బహుమతితో కూడిన విశిష్ట పురస్కారం కోసం ఎంపిక చేశారు. వీటితో పాటు రూ.1,116 ప్రత్యేక పురస్కారాల క్రింద యువ రచయిత పురస్కారానికి దొండపాటి కృష్ణ (రాతి గుండెల్లో నీళ్లు), బాల సాహిత్య పురస్కారానికి వాసుకి నూచెర్ల (తింగరి కథలు), ఆత్మీయ పురస్కారానికి కేతు పద్మమ్మ (అమ్మ మనసు) లను ఎంపిక చేశారు. ఈ పోటీకి తమ కథా సంపుటులు పంపిన నూరు మందికిపైగా రచయితలకు వారి పుస్తకాల ధరను చెల్లించి సభా పూర్వకంగా గౌరవించడమే కాకుండా అన్ని పుస్తకాల మీద సమీక్షలు, పుస్తక రూపంలో విడుదల చేయనున్నట్లు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. సాహితీ విశ్లేషకులు, పురస్కారాల ప్రదాత ఎన్ రవిశేఖరరెడ్డి ఎంపిక చేశారు. పుట్టంరాజు బుల్లెయ్య, రామ లక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అద్దంకిలోని పుట్టంరాజు కళాక్షేత్రం ధీరజ్ కోట్ల పురస్కారాల సభ జరుగుతుందని తెలిపారు.

దాతల సహకారంతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం

ప్రజాశక్తి - పంగులూరు

సిఎస్ఆర్ తోపాటు దాతల సహకారంతో కమ్యూనిటీ హాళ్ల నిర్మిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు బీసీ కాలనీ లో నిర్మించిన కమ్యూనిటీ హాలును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో నియోజకవర్గంలో రూ.6.90 కోట్లతో 20 కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు పి4లో భాగంగా దాతలు అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నా రని అన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం ఖర్చు చేయని విధంగా పెన్షన్లపై తమ ప్రభుత్వం ఖర్చు చేస్తుందని చెప్పారు. అర్హులైన అందరికీ పెన్షన్లు అందజేస్తున్నామని చెప్పారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా సిఎం చంద్రబాబు

కమ్యూనిటీ హాల్ ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి

పనిచేస్తున్నారని చెప్పారు. ఇటీవలే లక్షకుపైగా స్పౌజ్ పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు రానున్నాయని అన్నారు. పారిశ్రామికవేత్తల్లో సిఎం చంద్రబాబు నింపిన ఆత్మవిశ్వాసంతోనే రాష్ట్రానికి వస్తున్నారని చెప్పారు. యువతకు ఉద్యోగ కల్పన లక్ష్యంగా వైజాగ్‌లో పారిశ్రామిక వేత్తల సమావేశం జరిగిందని అన్నారు. నిరుద్యోగ యువతకు భవిష్యత్తులో మన రాష్ట్రంలోనే ఉద్యోగాలు రానున్నాయని చెప్పారు. అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో గోకులం షెడ్లను, సిమెంట్ రోడ్లను ప్రారంభించారు.

పలువురికి మంత్రి గొట్టిపాటి పరామర్శ

మండలంలోని రామకూరులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలువురిని పరామర్శించారు. ఇటీవల విద్యుత్ షాకుతో మరణించిన తెలుగుదేశం కార్యకర్త షేక్ మహమ్మద్ అలీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలీ మృతి పట్ల సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇటీవల కాలికి ఆపరేషన్ చేయించుకున్న మస్తానరావు ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డ దొడ్డక శ్రీనివాసరావు కుమారుడు అభిరామును పరామర్శించారు.

తిమ్మరాజుపాలెంలో నిర్మిస్తున్న ఫిల్టర్ బెడ్స్

వేగంగా ఫిల్టర్‌బెడ్ల నిర్మాణ పనులు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య తీరనున్నది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో మంచి నీటి సమస్య పరిష్కారం కానుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఎన్నో ఏళ్లుగా ఫిల్టర్ బెడ్స్ లేక మంచి నీటికి ఇబ్బంది పడిన గ్రామస్తులకు జల జీవన్ మెషిన్ కింద నిధులు మంజూరు చేయించారు. మంచినీటి చెరువు దుర్గంధమై ఫిల్టర్ బెడ్స్ లేక ఏళ్ళతరబడి దుర్గంధమైన నీటితో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య గత ఎన్నికల సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇచ్చిన హామీ మేరకు రూ.70.40 లక్షలు జల జీవన్ పథకం నిధులు మంజూరు చేయించారు. గ్రామంలో నూతనంగా ఫిల్టర్ బెడ్స్ నిర్మాణం, ఇంటింటికీ కుళాయిల నిమిత్తం నూతన పైప్ లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయంలో మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు

సత్యనారాయణస్వామి వ్రతంలో దగ్గుబాటి

ప్రజాశక్తి - కారంచేడు

స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం జరిగిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు పాల్గొని స్వామివారిని దర్శించు కున్నారు. సామూహిక వ్రతంలో 50 మంది భక్తులు పాల్గొ న్నారు. అనంతరం భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - బట్టిప్రోలు

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని వైసిపి ఇన్‌ఛార్జి వరికుటి అశోక్ బాబు సూచించారు. స్థానిక కార్యకర్తలు చేపట్టిన సంతకాల సేకరణను ఆయన పరిశీలించారు. సంతకాల సేకరణ పూర్తి చేసి కేంద్ర కార్యాలయానికి పంపించాల్సి ఉందని అన్నారు. సంతకాలను ఆయన గౌతమ్ పరిశీలించారు. ఎంపిటిసి కొతకు పద్మావతి, నాయకులు బుల్లెడ్డు ప్రతాప్, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక మాటూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల 3వ రోజున విద్యార్థినులకు రంగవల్లుల పోటీ లు నిర్వహించారు. 34 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. పోటీలకు మెడతాటి భవాని న్యాయ నిర్ణేతగా వ్యవహరిం చారు. గ్రంథాలయ అభివృద్ధికి కృషిచేసిన ఎస్ఆర్ రంగనా థన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరు నాగభూ షణం చేసిన సేవలు వివరించారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో కె ప్రణతి, ఎ జైష్ణవి నికిత, టి నాగస్విని, టి గీతిక, జూనియర్స్ విభాగంలో టి సరస్వతి, కె లేఖ్యశ్రీ, గెలుపొందారు. గ్రంథాలయ అధికారి కలపాల సుభాష్ చంద్రబోస్, తలశిల సత్యవతి, నీలా నాగవేణి పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం

ప్రజాశక్తి - బాపట్ల

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కోసం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆర్గనైజేషన్ కార్యదర్శి బత్తుల సురేష్ అన్నారు. కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన నిరుపేద లుక్క అంకమ్మ వంట చేసే క్రమంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో గాయాలయ్యాయి. స్థానిక ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధిత మహిళకు ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి, కోశాధికారి జోగి సుదర్శనరాజు, కోళ్లపూడి కుమార్, బొగ్గవరపు శివ, యాశం రాజా రమేష్, నరాలశెట్టి నాగరాజు, సుబ్బారావు, పెద్దమల్లు శ్రీకాంత్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

• రూ. 4.65 లక్షల నగదు, 16 గ్రాముల బంగారం స్వాధీనం • పోలీసులను అభినందించిన ఎస్పీ

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని పేరాలలో ఈ నెల 8న జరిగిన చోరీ కేసులో నిందితుడిని 2వ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ బి నాగభూషణం ఆదివారం వివరాలు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా నెహ్రూ బొమ్మ సెంటర్ కొత్తపేటలో నివాసం ఉంటున్న గుడే హరీష్ కుమార్ ఈ నెల 8న పేరాల ముట్టేవారివీధిలో నివాసం ఉంటున్న గుండా నరసింహారావు ఇంటిలో వేకువ జామున చోరికి పాల్పడ్డారు. అయితే బాధిత దంపతులు ఇరువురు కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న హోల్‌సేల్ పండ్ల షాపుకు వెళ్లగా ఇంటి తలుపులు పగలకొట్టి బెడ్‌రూంలోని బీరువా పగలుగొట్టి అందులోని రూ.6లక్షల నగదు, 16 గ్రాముల బంగారం నల్లపూసల గొలుసును గుడె హరీష్‌కుమార్ దొంగిలించినట్లు చెప్పారు. ఉదయాన్నే పనికి వెళ్లిన పనిమనిషి ఇంటికి వెళ్లేసరికి తలుపులు పగలగొట్టి బీరువాలో వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతో ఇంటి యజమాని నరసింహారావుకు సమాచారం అందించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డీఎస్పీ మొయిన్

వివరాలు వెల్లడిస్తున్న టూ టౌన్ సిఐ బి నాగభూషణం

నేతృత్వంలో సిఐ నాగభూషణం ఆధ్వర్యంలో మూడు బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. హాయ్ రెస్టారెంట్ సమీపంలోని గ్యాస్ గోడౌన్ వద్ద నిందితుడు హరీష్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. నిందితుడి వద్ద రూ. 4.65 లక్షల నగదు, 16 గ్రాముల నల్ల పూసల గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు బృందంలో ఎస్ఐలు ఎం వెంకటేశ్వర్లు, నాగశ్రీను, క్రైమ్ సిబ్బంది హెచ్‌సిలు అచ్చయ్య, తన్నీరు శ్రీను, ప్రసాద్, బాలచంద్ర, టూ టౌన్ స్టేషన్‌కు చెందిన హెచ్‌సిలు శివప్రసాద్, పిసీలు శ్రీనివాసు, శేఖర్, బాలాజీ పాల్గొన్నారు. కేసును సమర్థవంతంగా 8రోజుల్లో ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఉమామహేశ్వర్ అభినందించారు.

స్కాలర్షిప్ అందిస్తున్న కాపు సంఘం నాయకులు

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - బాపట్ల

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఐఎఎస్ లక్ష్మీకాంతం అన్నారు. కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో సూర్యలంక రహదారిలో అటవీ జీడి మామిడి తోటలో నిర్వహించిన కాపు వన సమారాధనకు ఆమె హాజరయ్యారు. కార్తీక మాస విశిష్టత తెలిపారు. శాసన మండలి మాజీ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ కాపుల్లో వైద్య విద్య చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు రూ.30వేలు, బివిఎస్‌సి చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు రూ.13వేలు, పీజీ చదువుతున్న 27 మంది విద్యార్థులకు రూ.1.62లక్షలు, బిటెక్ 80శాతం పైబడి మార్కులు సాధించిన 172 మంది విద్యార్థులకు రూ.8.60 లక్షల, పీజీ 80 శాతం సాధించిన 100 మంది విద్యార్థులకు రూ.4లక్షలు, 41 మంది డిగ్రీ విద్యార్థులకు రూ.1.64లక్షలు, ముగ్గురు బి ఫార్మసీ విద్యార్థులకు రూ.12 వేలు, ఎనిమిది మంది డిప్లమా విద్యార్థులకు రూ.32వేలు, 26 మంది సప్లమెంటరీ విద్యార్థులకు రూ.7800, 183 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.5.49 లక్షలు మొత్తం 564 మంది విద్యార్థులకు రూ.23లక్షలు స్కాలర్ షిప్పులు పంపిణీ చేశామని అన్నారు. కార్యక్రమంలో కాపు సేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, జాతీయ కాపునాడు అధ్యక్షుడు గోళ్ళ సుబ్రమణ్యం, మెండు చక్రపాణి, బివిఎల్ నరసింహారావు, గొర్రిపాటి అర్జునరావు, బొందలపాటి వెంకట్రావు, తులసి సాయి దాసు, పర్వతరెడ్డి భాస్కరరావు, నరాలశెట్టి ప్రకాష్ పాల్గొన్నారు.

కూరగాయల రైతులకు అపార నష్టం

లాభాలు పొందుతున్న కమీషన్ వ్యాపారులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

తుఫాను ప్రభావంతో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చినప్పటికీ వాటిని పండించే రైతులు మాత్రం ఆవేదన చెందుతున్నారు. వినియోగదారులు అధిక ధరలు చెల్లించి నష్టపోతున్నారు. ధర ఉన్నప్పటికీ దిగుబడి లేదని రైతులు వాపోతున్నారు. రాజుగారిపాలెంలో సొరకాయల పంట సాగు చేస్తున్న భార్య, భర్తలను ప్రజాశక్తి పలకరించింది. రైతు ఓబులశెట్టి రమేష్ అతని భార్య శివ కోటేశ్వరమ్మ మాట్లాడుతూ అర ఎకరం సొరకాయలు, ఆకుకూరలు సాగు చేపట్టినట్లు తెలిపారు. సొరకాయలు కాయ ఒక్కటి రూ.25 ధర పలుకుతుందని అన్నారు. అయితే తుఫాను ప్రభావంతో కాయల కాపు బాగా తగ్గిందని తెలిపారు. తుఫాను ప్రభావంతో దొండ పందిరిలు, వంగ, బీరా తదితర కూరగాయల పంటలు సాగుచేసిన రైతులకు పంట దిగుబడి దెబ్బతిన్నట్లు తెలిపారు. కూరగాయల ధరలు చుక్కలంటుతున్నప్పటికీ రైతులకు పంట దిగుబడితోపాటు కమీషన్ వ్యాపారులు సరియైన ధరలు ఇవ్వటం లేదని తెలిపారు. రిటైల్ మార్కెట్‌కు అధిక కమిషన్ తీసుకొని అమ్ముతున్నారని తెలిపారు. విత్తనం నాటిన నాటి నుంచి ఆరుగాలం శ్రమించి నీరు, ఎరువులు, పురుగు మందులు వేసి శ్రమించిన రైతులు నష్టపోతున్నారు. పంట చేతికి వచ్చినప్పటికీ పంట

రాజుగారిపాలెంలో సొర సాగు చేస్తున్న దంపతులు

పండించే రైతుల కన్నా కమిషన్, దళారులు, రిటైల్‌గా అమ్మే వారికే నికర లాభం ఉంటున్నట్లు తెలిపారు. ధరతో పాటు దిగుబడి ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుందని, లేకుంటే గిట్టుబాటు కాటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఇరువురం మొక్క నాటిన నాటి నుంచి కాయ కోత కోసి మార్కెట్‌కు తరలించే వరకు శ్రమ చేయడం వలన కొంత వరకు నష్టాలు తప్పుతున్నాయని తెలిపారు. అదే అంతా కూలీలపై ఆధారపడి కూరగాయలు సాగు చేసే వారికి నష్టాలే వస్తున్నాయని అన్నారు. అది కూడా ఒక లాటరీలా దిగుబడి ఉన్నప్పుడే రైతులు లాభాలు ఆశిస్తున్నారని అన్నారు. అలాంటి సందర్భాలు ఏదో ఒక సంవత్సరం మాత్రమే తగులుతుందని తెలిపారు. ఎక్కువ సార్లు పెట్టుబడి పెట్టిన దానికి గిట్టుబాటు ఫల సాయం రావటం లేదని తెలిపారు.

ముక్తేశ్వరం మేజర్ కాలువ పరిశీలన

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని ముక్తేశ్వరం మేజరు కాలువలో చిల్ల చెట్టు ఎక్కువగా పెరిగిపోవడంతో పంట పొలాలకు నీరు సక్రమంగా అందడం లేదని స్థానిక రైతులు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ ద్వారా వివరించారు. విషయం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులతో మంత్రి రవికుమార్ మాట్లాడారు. పూడిక తీత పనులు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ క్రమంలో మంత్రి రవికుమార్ ఆదివారం కాలువను ప్రత్యక్షంగా పరిశీలించారు. పూడిక పనుల పురోగతిని సమీక్షించారు. నీటి ప్రవాహం సాఫీగా వ్యవసాయ భూములకు చేరేలా అవసరమైన చర్యలు వేగంగా పూర్తి చేయాలని అధికారుల కు సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు నిరంతరం అందేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.

రాష్ట్ర ఆర్చరీ పోటీలకు అభిలాష ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు కెఎంఎస్ విద్యార్థిని కొప్పోలు అభిలాష ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జిఎఫ్) ఆర్చరీ పోటీలలో ప్రతిభ కనపర్చిన ఒంగోలు కష్ణ మెమోరియల్ స్కూల్‌లో 7వ తరగతి విద్యార్థిని కొప్పోలు అభిలాష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 19 నుంచి 21 వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో జరిగే జాతీయ ఆర్చరీ పోటీలలో అభిలాష పాల్గొననుంది. ఈ సందర్భంగా కెఎంఎస్ స్కూల్ కరస్పాండెంట్ ఐ.వసుంధర దేవి, ప్రిన్సిపల్ ఐ.లక్ష్మి జాహ్నవి విద్యార్థినిని అభినందించి ఈ పోటీలలో రాష్ట్రానికి పతకాలు తేవాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థిని కొప్పోలు అభిలాషను స్కూలు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

అభిలాషను అభినందిస్తున్న ప్రిన్సిపల్ లక్ష్మిజాహ్నవి

23న జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు

- దర్శిలో నిర్వహణ
- జయప్రదం చేయాలని జెవివి పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో ఈ నెల 23న దర్శిలోని ఝాన్సీ విద్యా సంస్థలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని జెవివి జిల్లా కమిటీ సమావేశం పిలుపునిచ్చింది. ఒంగోలులోని యల్.బి.జి భవన్‌లో జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి బి.తిరుపతయ్య అధ్యక్షతన జె.వి.వి. జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య వక్తగా జెవివి సీనియర్ నాయకులు ఎవి.పుల్లారావు మాట్లాడుతూ సమాజ మార్పు కోసం శాస్త్రీయ దక్పథం పెంపొందించేందుకు జెవివి గత 38 సంవత్సరాలుగా కృషి చేస్తోందన్నారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ జయప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక స్పృహను, సైన్స్ పట్ల ఆసక్తిని, ప్రశ్నించేతత్వాన్ని పెంపొందింపచేసేందుకు ప్రతి ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి సంబరాలకు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. జిల్లా స్థాయి చెకుముకి సంబరాల గోడపత్రికలను ఈ సమావేశంలో ఆవిష్కరించారు. సమావేశంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యస్.వి.రంగారెడ్డి, యన్‌టి.వెంకటేష్, డి.చంద్రశేఖర్, యన్. శివపార్వతి పాల్గొన్నారు.

జివిఎల్.మూర్తికి పితృవియోగం

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని వేంపాడుకు చెందిన ఏపీ హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్ జివిఎల్.మూర్తికి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి గంగినేని బ్రహ్మనాయుడు (92) అనారోగ్యం, వయోభారంతో ఆదివారం సాయంత్రం మరణించారు. బ్రహ్మనాయుడు పెద్ద కుమారుడు గంగినేని సత్యనారాయణ వేంపాడులో సిపిఎం శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. బ్రహ్మనాయుడుకు వేంపాడు వెల్ఫేర్, డెవలప్‌కమిటీ సభ్యులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బ్రహ్మనాయుడు (ఫైల్)

సచివాలయ ఉద్యోగుల

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం

రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి.రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేపట్టక తప్పదని ఆ సంఘ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల హక్కుల రక్షణ కోసం ఏర్పాటైన (ఏపీజి ఎస్ డబ్ల్యూఎస్ఇ ఆర్ పిఎఫ్) జెఎసి ఆధ్వర్యంలో ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల సంయుక్త ఆత్మీయ సమావేశం ఆదివారం ఒంగోలులోని యుటిఎఫ్ వేదికగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో సచివాలయం ఉద్యోగులు హాజరై తమ సమస్యలు ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఘాటుగా విమర్శించారు. ఆరు సంవత్సరాలుగా పని చేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు స్పష్టమైన సర్వీస్ రూల్స్ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి, శ్రమ దోపిడికి నిదర్శనం అన్నారు. ఎవరికి ఏ హోదా? ఏ బాధ్యత? ఏ అర్హత? అన్నదే స్పష్టంగా లేకపోవడంతో ఉద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని ఆమె మండిపడ్డారు. క్యాబినెట్ సబ్ కమిటీ నివేదికను త్వరితగతిన విడుదల చేసి, ప్రోమోషన్ ఛానల్ లేని విభాగాల ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. డిప్యుటేషన్ల పేరుతో అక్రమ బదిలీలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అర్హత ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలని స్పష్టం చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, ఎఎఎస్ ఇవ్వడంలో జాప్యాన్ని తొలగించాలన్నారు. సర్వీస్ రిజిస్టర్లలో తప్పుడు జాయినింగ్ తేదీలు, విడుదల కాని సీనియార్టీ లిస్టులు వంటి సమస్యలను ఆమె తీవ్రంగా ప్రస్తావించారు. ఆరు ఏళ్లుగా సీనియార్టీ లిస్టే విడుదల కాలేదని, ఉద్యోగుల సమస్యల పట్ల ఎంత నిర్లక్ష్యం వహిస్తుందో, ఉందో దీనితో స్పష్టమవుతోందని రాజ్యలక్ష్మి పేర్కొన్నారు.

సచివాలయ సిబ్బందిని ఒత్తిడులకు గురిచేస్తున్న జిఓ 11ను వెంటనే రద్దు చేసి, ఉద్యోగులను గౌరవప్రదంగా పని చేసే విధంగా వ్యవస్థగా ఉంచాలని ఆమె డిమాండ్ చేశారు. పింఛన్ పంపిణీ, భూ సర్వేలు, పథకాల వెరిఫికేషన్, స్కూల్ ఇన్స్పెక్షన్లు వంటి ఎన్నో ఫీల్డ్ పనులు చేస్తున్న సచివాలయ ఉద్యోగులకు ట్రావెల్ అలవెన్స్ ఇప్పటివరకు ఇవ్వకపోవడం అమానుషమని విమర్శించారు. ఏళ్ల తరబడి వినతులు ఇచ్చినా సచివాలయ ఉద్యోగులందరికీ కేడర్ అప్డేట్ చేయకుండా కేవలం పంచాయతీ కార్యదర్శులకే చేస్తుండడం తీవ్ర అన్యాయమన్నారు. అన్ని విభాగాల సచివాలయ ఉద్యోగులకు సమాన హక్కులతో కేడర్ అప్డేట్ చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థను నడిపేది ఈ ఉద్యోగులేనని, వారిని నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం చేపట్టక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రకాశం, నెల్లూరు, బాపట్ల కు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ జెఎసి సమావేశంలో పాల్గొన్న నాయకులు

భారీ పరిశ్రమలతో యువతకు ఉపాధి

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భారీ పరిశ్రమలతో యువకు ఉపాధి లభిస్తుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఇటీవల విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరిగిన సిఐఐ సమ్మిట్ 2025పై ఆయన మాట్లాడుతూ రెండు రోజుల ఫలితాల్లో రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పైగా పెట్టుబడులు, 16 లక్షల యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో కొత్త కంపెనీలు తీసుకు రాకపోగా ఉన్న కంపెనీలను పక్క రాష్ట్రాలకు తరిమివేశారన్నారు. ఇప్పుడు సిఐఐ సమ్మిట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులు, ఉద్యోగాలు, అభివద్ధిలో ముందడుగు వేస్తోందన్నారు ఈ విజయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటి మంత్రి లోకేష్ నేతత్వం కీలకమన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివద్ధికి దఢమైన దారిని చూపుతూ, పెట్టుబడులు, ఉద్యోగాలు, ఇన్నోవేషన్ పై దృష్టి పెట్టి రాష్ట్రాన్ని వ్యాపార కేంద్రంగా రూపొందించారన్నారు. మంత్రి లోకేష్ సిఐఐ సమ్మిట్ వేదికను ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, కంపెనీలతో నేరుగా చర్చలు జరిపి, కొత్త పెట్టుబడులను రాష్ట్రానికి రావడానికి ఎంతో కషి చేశారన్నారు. ప్రతి అవకాశాన్ని ఫలితాలుగా మార్చడంలో లోకేష్ కష్టం స్పష్టంగా కనిపించిందని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలియజేశారు.


ఎమ్మెల్యే దామచర్ల

సనాతన ధర్మమే అసమానతలకు మూలం

సామాజిక విశ్లేషకురాలు పి.ఎ.దేవి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

భారత సమాజంలో కొనసాగుతున్న సామాజిక అసమానతలకు సనాతన ధర్మమే ప్రధాన కారణమని సామాజిక-సాంస్కతిక విశ్లేషకురాలు పి.ఎ.దేవి పేర్కొన్నారు. ఆదివారం సైంటిఫిక్ సోషల్ స్టడీ సర్కిల్ ఒంగోలు శాఖ నాలుగో వార్షికోత్సవం, 1917 అక్టోబర్ విప్లవం 108వ వార్షికోత్సవాల సందర్భంగా మల్లయ్య లింగం భవన్ లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎం.వెంకయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేవి మాట్లాడుతూ సనాతన ధర్మం పునాది నుంచే మహిళలను, శూద్రులను దిగువ స్థాయిలో ఉంచే విధంగా నిర్మించబడిందన్నారు. విద్య, స్వేచ్ఛ, హక్కులపై ఆంక్షలే దాని కేంద్రబిందువని విమర్శించారు. మనుస్మృతి వంటి గ్రంథాలు శ్రామిక వర్గాల శ్రమను దోచుకునే విధానాలకు పునాది వేసినవేనని పేర్కొన్నారు. కర్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం ద్వారా ప్రజలను ప్రశ్నించకుండా, తిరగబడకుండా చేసే సామాజిక వ్యవస్థను సనాతనం బలపరుస్తుందని చెప్పారు. సనాతనవాదులు చూపించేది కొద్దిపాటి మెరుగు భాగమే గానీ, దాని పూర్తి భావం ప్రజలకు తెలిసిన రోజు దానిని అంగీకరించే వారు ఎవరూ ఉండరని దేవి స్పష్టం చేశారు. రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామిక విలువలకు విరుద్ధంగా సనాతనం పనిచేస్తోందని, దేశంలో ప్రజాస్వామ్య భావన సనాతనం కన్నా పురాతనమైందని చెప్పారు. ప్రస్తుతంలో కార్పొరేట్ శక్తులతో కలసి ప్రజల సమస్యలపై దష్టి మళ్లించేందుకు సనాతన – మత చర్చలను ముందుకు తెస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు. పోర్టులు, రైల్వేలు, ఎల్ఐసీ వంటి ప్రజా వనరులు కార్పొరేట్లకు అప్పగించడం ప్రజాస్వామ్యం కాదని, దీనికి వ్యతిరేకంగా ప్రశ్నించే పౌరసమాజం అవసరమని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు, వనరుల దోపిడీ, అవకాశాల లేమి వంటి అసలు సమస్యలపై ప్రజలు ప్రశ్నించకుండా మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టడం పాలకుల వ్యూహమని ఆక్షేపించారు. సనాతన ధర్మం పేరుతో అన్ని వర్గాలపై జరుగుతున్న అన్యాయాలకు అడ్డుకట్ట వేసే సమయం వచ్చిందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పి.ఎ.దేవి